AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
7-4-2026 (Tuesday) MAIN EDITION

## ఎయిరిండియా సీఈవో రాజీనామా




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా సంస్థ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా చేశారు. 2022లో ఐదేళ్ల కాంట్రాక్ట్‌పై ఆయన నియమితులయ్యారు. విల్సన్ పదవీకాలం జూలై 2027లో ముగియనుంది. అంతలోపే ఆయన రాజీనామా చేశారు. గతేడాది అహ్మదాబాద్‌లో ఎయిరిండియా బోయింగ్ విమానం కూలిపోయిన ఘటనలో 260 మంది చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం, నిరంతర నష్టాలు, పెరిగిన నియంత్రణ సంస్థల పరిశీలనతో సతమతమవుతున్న ఎయిర్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా చేశారని సమాచారం.

## 5 కేజీల సిలిండర్ల సరఫరా రెట్టింపు



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశంలోని వలస కార్మికులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. వారికి ఇచ్చే 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ రాష్ట్రాలకు లేఖ రాశారు. వలస కార్మికులకు 5కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు సరఫరా చేస్తామని గతంలో కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రాలకు సిలిండర్లను కేటాయించింది. తాజాగా వాటి సరఫరాను రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇచ్చే 5 కేజీల సిలిండర్ల రోజువారీ కేటాయింపును పెంచాలని నిర్ణయించింది.

## ప్రాణత్యాగానికి సిద్ధమే..




**అక్షరటుడే, ఇంటర్నెట్ డెస్క్:** హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు అమెరికా విధించిన డెడ్‌లైన్ సమీపిస్తున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో ప్రాణాలను త్యాగం చేయడానికి తనతో సహా ఇరాన్ పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు.

## అమరావతి.. మన ఆత్మగౌరవానికి ప్రతీక




**అక్షరటుడే, ఏపీ:** అమరావతి.. మన ఆంధ్రప్రదేశ్ రాజధాని అని.. ఇవాళ రాష్ట్ర ప్రజలందరికీ ఒక చారిత్రక విజయ క్షణమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. అమరావతి.. మన ఆత్మగౌరవానికి, మన భవిష్యత్తుకు ప్రతీక అని పేర్కొన్నారు. రాజధాని రైతుల త్యాగానికి, ప్రజల ఆశలకు లభించిన న్యాయం ఇది అని వ్యాఖ్యానించారు.

## పాక్‌కు రక్షణమంత్రి స్ట్రాంగ్ వార్నింగ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్తాన్‌కు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రగల్భాలకు కౌంటర్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో దేవుడికే తెలుసని వ్యాఖ్యానించారు. 55 ఏళ్ల క్రితం ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే పాక్ రెండు ముక్కలైందన్నారు.

## వందే భారత్ రైలు భోజనంలో పురుగు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వందే భారత్ రైలులో అందించే ఆహారంలో పురుగు రావడం తీవ్ర కలకలం రేపింది. అహ్మదాబాద్ నుంచి ముంబై వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఆహార నాణ్యతపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా అహ్మదాబాద్-ముంబై వందే భారత్ రైలులో ప్రయాణికులకు అందించిన భోజనంలో పురుగు ప్రత్యక్షమైంది. ఒకే కోచ్‌లో ఇలాంటి ఘటనలే రెండు వెలుగుచూడడంతో ప్రయాణికులు భోజనం చేయడం ఆపేశారు. ఆహార సరఫరా సంస్థ 'బృందావన్ ఫుడ్ ప్రొడక్ట్స్'పై తక్షణమే తనిఖీలు నిర్వహించి లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## పనామా కాలువ బ్రిడ్జి సమీపంలో భారీ పేలుడు

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పనామా కాలువ వంతెన సమీపంలో భారీ పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పనామాలోని ఒక వంతెన సమీపంలో ఇంధన ట్యాంకర్లు పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం బల్బోవా చమురు ట్యాంక్ కేంద్రంలో మంటలు చెలరేగి, బ్రిడ్జ్ ఆఫ్ ది అమెరికాస్‌ను చుట్టుముట్టడంతో ఈ పేలుడు సంభవించింది. ప్రమాదంతో అధికారులు తాత్కాలికంగా వంతెనను మూసివేశారు.

# హరీశ్‌రావు అరెస్టు



- పరిగి పర్యటనకు వెళ్తుండగా అడ్డగింత
- శంషాబాద్ స్టేషన్‌కు తరలింపు
- బీఆర్‌ఎస్ శ్రేణుల ఆగ్రహం

**మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. పరిగి పర్యటనకు బయలుదేరిన ఆయనను అప్పా జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డిని కూడా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ స్టేషన్‌కు తరలించారు.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రీయల్ పార్క్ కోసం ప్రజల నుంచి సేకరించిన భూములు తిరిగి ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బాధిత రైతులను కలవడానికి ఆయన వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దీంతో మంగళవారం ఉదయం ఆయనను అధికారులు హౌజ్ అరెస్ట్ చేశారు. బయటకు వెళ్లకుండా భారీగా మోహరించారు. అయితే ఎన్ని నిర్బంధాలు ఎదురైనా పరిగి వెళ్లి తీరుతానని హరీశ్‌రావు ప్రకటించారు.

### అప్పా జంక్షన్ వద్ద..

హరీశ్‌రావు తన ఇంటి నుంచి మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇతర నాయకులతో కలిసి పరిగి బయలు దేరారు. వారిని అప్ప జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై బీఆర్‌ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం పోలీసులు హరీశ్‌రావును అరెస్ట్ చేశారు.

### రేవంత్ పగటి కలలు

పోలీస్ స్టేషన్‌లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి మళ్లీ గెలుస్తా అని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మళ్లీ వచ్చేది రామ రాజ్యం, కేసీఆర్ రాజ్యం అన్నారు. అంతకు ముందు ఆయన తన నివాసంలో మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గంలో దళిత, గిరిజన బలహీన వర్గాల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కుల పేరిట గుంజుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతుల పక్షాన పోరాడటానికి బీఆర్ఎస్ వెళ్తుంటే అరెస్టులు చేసి, నిర్బందాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి వచ్చిన రెండున్నరేళ్లలో 10 వేల ఎకరాల దళితుల, ఎస్టీల భూములు లాక్కున్నారని ఆరోపించారు.

### అక్కడ పెట్టండి

ప్రభుత్వం కంపెనీలు పెట్టాలనుకుంటే పరిగి చుట్టుపక్కల మోమిన్‌పేట్ వద్ద 1000 ఎకరాల భూమి ఉందని మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. ఆ భూముల్లో పరిశ్రమలు పెట్టాలని సూచించారు. కేసీఆర్ అక్కడ గతంలోనే భూ సేకరణ చేసి పెట్టారన్నారు. అదేకాకుండా పరిగికి 10 కిలోమీటర్ల దూరంలోని రాకంచర్ల వద్ద 200 ఎకరాల భూమి ఉందని, నంచెర్లలో 100 ఎకరాలు, సీతారాంపురంలో మరో 1000 ఎకరాలు ఉందన్నారు.

## భారత ఆర్మీ చేతికి భారీగా సూసైడ్ డ్రోన్లు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత అమ్ముల పొదిలో మరిన్ని అస్త్రాలు చేరాయి. వందలాది సూసైడ్ డ్రోన్లను సూరత్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ ఆర్మీకి అప్పగించింది. ఇన్‌సైడ్‌ఎఫ్‌పీవీ సంస్థతో రక్షణశాఖ గత డిసెంబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా రెండు నెలల్లోనే ఆ కంపెనీ కామికేజ్ డ్రోన్లను ఆర్మీకి అప్పగించింది. ప్రస్తుతం యుద్ధ తంత్రం మారింది. క్షిపణులు, డ్రోన్లు యుద్ధాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ వ్యయంతో నిర్మించిన సూసైడ్ డ్రోన్లు శత్రువులకు భారీగా నష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ వాటిని సమకూర్చుకోవాలని భావించింది. ఇందులో భాగంగా గుజరాత్‌కు చెందిన ఒక డీప్‌టెక్ డ్రోన్ కంపెనీతో గతంలో ఒప్పందం చేసుకుంది. సూరత్‌కు చెందిన ఇన్‌సైడ్‌ఎఫ్‌పీవీతో గతేడాది డిసెంబర్‌లో ఈ కాంట్రాక్టు కుదిరింది. అత్యవసర సేకరణ మార్గం ద్వారా రెండు నెలల్లోనే డ్రోన్లను సైన్యానికి అందజేశారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు



**అక్షరటుడే, జగిత్యాల:** జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. పలు విభాగాల అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మున్సిపల్‌లోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ తదితర విభాగాల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యాలయ సిబ్బంది ఫోన్లను అధికారులు తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. కాగా.. ఇటీవల కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో సైతం ఏసీబీ దాడులు చేపట్టిన విషయం తెలిసిందే.


## సినిమాలకు త్రిష గుడ్‌బై..?



దాదాపు 2 దశాబ్దాల నుంచి స్టార్ హీరోయిన్‌గా రాణిస్తుంది చెన్నై ముద్దుగుమ్మ త్రిష. తమిళం, తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించిన ఆమె.. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అదరగొడుతోంది. అయితే ఈ మధ్య పర్సనల్ లైఫ్‌కు సంబంధించి ఎక్కువ వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత దళపతి విజయ్‌తో ఎఫైర్ ఉందంటూ రూమర్స్ వినిపిస్తున్నాయి. ఓ ఈవెంట్‌లో విజయ్, త్రిష వీరిద్దరూ కనిపించడంతో గాసిప్స్‌కు మరింత బలం చేకూరినట్లయ్యింది. వివాదాల మధ్య కోలీవుడ్‌లో మరో న్యూస్ చక్కర్లు కొడుతోంది. త్రిష త్వరలోనే యాక్టింగ్‌కు గుడ్‌బై చెప్పబోతోందనేది ఆ వార్త సారాంశం. దీనికి బలం చేకూర్చేలా.. త్రిష ఇటీవల కొత్తగా ఏ ప్రాజెక్ట్‌కు సైన్ చేయలేదు, పైగా చర్చల దశలో ఉన్న రెండు సినిమాలను కూడా హోల్డ్‌లో పెట్టిందట.సినిమాలకు గుడ్‌బై చెప్పి పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతోందనే మరో స్ట్రాంగ్ బజ్ కూడా నడుస్తోంది.

—అక్షరటుడే, సినిమాడెస్క్

## ఇరాన్‌కు విధించిన డెడ్‌లైన్‌పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియా యుద్ధంలో నేడు ఏం జరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠతో ఎదురు చూస్తోంది. మంగళవారం రాత్రిలోపు హర్మూజ్ జలసంధిని తెరవకపోతే ఇరాన్‌లోని వంతెనలు, పవర్ ప్లాంట్లను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. మరోవైపు తమ మౌలిక వసతులపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ సైతం వార్నింగ్ ఇచ్చింది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. డెడ్‌లైన్ తర్వాత ఇరాన్‌లో పవర్ ప్లాంట్స్, బ్రిడ్జిలు ఉండవన్నారు. నాలుగు గంటల్లో ఆ దేశంలోని పవర్ ప్లాంట్స్, వంతెనలు పేల్చేయగలమని చెప్పారు. ఆ దేశంలో నేవీ, ఎయిర్‌ఫోర్స్, డిఫెన్స్ సిస్టమ్ లేదన్నారు. యుద్ధంలో దక్షిణ కొరియా, జపాన్, ఆస్ట్రేలియా తమకు సహకరించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే తాము విజయం సాధించామని చెప్పారు.

## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ?



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయెల్ - అమెరికా దాడుల్లో ఆయన గాయపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లే ఖమేని ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్ - అమెరికా దాడుల్లో చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆయన రెండో కుమారుడు మోజ్తాబా ఖమేనీ సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యారు. అయితే ఆయన కూడా అస్వస్థతకు గురై.. ఖోమ్‌లో వైద్య చికిత్స పొందుతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. యుద్ధ సమయంలో దేశ నాయకత్వ నిర్మాణంపై ఇది కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది.

## ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు పోటీ..



**అక్షరటుడే, నల్గొండ:** ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ పాఠశాలకు అడ్మిషన్ల తాకిడి నెలకొంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అడ్మిషన్ల కోసం డిమాండ్ భారీగా పెరగడంతో తల్లిదండ్రులు తెల్లవారుజాము నుంచే బడి ఎదుట బారులు తీరుతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన కుమారుడు ప్రతీక్ జ్ఞాపకార్థం ఈ బడిని అభివృద్ధి చేశారు. తన ట్రస్ట్ ద్వారా రూ. 8 కోట్లు వెచ్చించి ఈ పాఠశాలను ఆధునీకరించారు. ఇందులో 36 ఏసీ స్మార్ట్ తరగతి గదులు, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఆంగ్ల, ఉర్దూ మీడియంలలో బోధనతో పాటు క్రీడా సౌకర్యాలను కూడా ఏర్పాటు చేశారు. బడిలో ఆధునిక వసతులు ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించడానికి పోటీ పడుతున్నారు.